క్లుప్తంగా

ఘనంగా బాలికా దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ తదితరులు

చీపురుపల్లి: మండలంలోని మెట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక, సమత సంస్థలు నేతృత్వంలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, లింగ నిర్ధారణ, మహిళా రిజర్వేషన్లు, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఆర్.విజయకుమార్, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు వి.మోహనరావు, సమత కన్వీనర్ ఎం.సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలి

• ఎస్పీ ఏ.ఆర్. దామోదర్



గంట్యాడ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ దామోదర్

గంట్యాడ: జిల్లాలో గంజాయి అక్రమ రవాణను అరికట్టాలని ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ పోలీసులను ఆదేశించారు. గంట్యాడ పోలీస్ స్టేషన్‌ను ఆయన శనివారం సందర్శించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను నిబంధనల మేరకు డిస్పోజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. డయల్ 100, 112 కాల్స్‌కు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఆహ్లాదకరంగా, సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు మృతి



బొర్రా సత్య నారాయణ (ఫైల్)

గజపతినగరం: మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు బొర్రా సత్యనారాయణ శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన వివిధ దినపత్రికల్లో పనిచేశారు. మృతుడు సత్యనారాయణ భౌతికకాయాన్ని శనివారం పలువురు జర్నలిస్టులతో పాటు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ సంతాపం తెలిపారు.

రైతులకు తప్పని యూరియా కష్టాలు



యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

గుర్ల: మండలంలోని రైతులను యూరియా కష్టాలు వీడడం లేదు. ఒక్క బస్తా యూరియా కోసం ఇంకా దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ దుకాణం వద్ద శనివారం యూరియా పంపిణీ చేశారు. యూరి యా కోసం రైతులు తీవ్రమైనా ఎండలో క్యూలో ఉండాల్సి వచ్చింది. వ్యవసాయ అధికారులు క్యూలైన్‌లో ఉన్న రైతులందరికీ యూరియా అందేలా చర్యలు తీసుకున్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి



బాలికలతో హెచ్ఎం వల్లి,తదితరులు

వేపాడ: ఆడపిల్లలు మగ పిల్లలతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వల్లి అన్నారు. శనివారం ఆమె నేతృత్వంలో పాఠశాలలో అంతర్జాతీయ బాలికాదినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆడబిడ్డలు సమాజానికి ఎందుకు కావాలి, వారి ఆవశ్యకత ఏంటి, సమాజాన్ని నిర్దేశించడంలో ఆడబిడ్డల పాత్ర, ఆడపిల్లలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, శారీరకంగా, మానసికంగా ఎలాంటి ఎదుగుదల సాధించాలన్న విషయాలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఎంఎస్‌కె అరుణ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు హాజరయ్యారు.

బురద నీటిని తాగేదెలా..?

- రామన్నపేటలో కలుషితమవుతున్న తాగు నీరు
- వర్షా కాలంలో పైపుల ద్వారా బురద నీరు సరఫరా అవుతున్న వైనం
- పైపులైన్లకు లీకులతో పాటు కుళాయి పాయింట్లు గోతుల్లో ఉండడమే కారణం
- అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తుల ఆరోపణ



రామన్నపేట గ్రామం



రామన్నపేటలో కుళాయిల ద్వారా వస్తున్న బురద నీరు

గజపతినగరం:

ఓ మోస్తారు వర్షం కురిస్తే చాలు మండలంలోని రామన్నపేట గ్రామస్తులు తాగునీటికి అవస్థలు పడాల్సిందే. గ్రామంలో 40 వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకం, కుళాయిలు ఉన్నప్పటికీ గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకా లంలో బురదనీరే దిక్కు అవుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో సుమారు 300 కుటుంబాలు, 1,450 మంది జనాభా ఉన్నారు. వీరంతా తాగునీటికి స్థానికంగా ఉన్న రక్షిత మంచినీటి పథకంపైనే ఆధారపడుతుంటారు. వాటర్ ట్యాంకు నుంచి కుళాయిలకు వేసిన పైపులైన్లకు కాలం చెల్లడంతో కొన్ని చోట్ల లీకులు ఏర్పడ్డాయి. సుమారు 200 కుళాయి పాయింట్లు ఉండ గా, వీటిలో జలజీవన్ మిషన్ పథకం కింద 137 ఏర్పాటు చేశారు. జల జీవన్ మిషన్ పథకం పనులు చేసినప్పుడు పాత పైపులైన్లను మార్చకుండా కుళాయిలు వేసేశా ర ని గ్రామస్తులు చెబుతున్నారు. కుళాయి పాయింట్లు చాలా వరకు గోతుల్లో ఉండడం, పైపులైన్లకు లీకులు ఉండడం వల్ల వర్షాలు కురిసేట ప్పుడు వరద నీరు పైపుల్లోకి చేరుతోంది. అలాగే రక్షిత మంచినీటి పథకం వద్ద తాగునీటి సరఫరా నిలిపివేసిన సమయంలో గోతుల్లో కుళాయి పాయింట్ల నుంచి బురదనీరు వెనక్కి లాగుతుండడం తాగునీటి కలుషితానికి ప్రధానం కారణం. వర్షాకాలంలో కుళాయిల ద్వారా రోజూ సుమారు 20 నిముషాలు పాటు బురద నీరు వస్తుందని, ఆ తర్వాత మంచి నీరు వస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు.

రోగాల బారిన పడుతున్నాం..

కలుషిత నీటి వల్ల రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపైపు లైన్లు వేయడంతో పాటు కుళాయిల వద్ద ప్లాట్‌ఫారాలు నిర్మించి, ట్యాపులు ఏర్పాటు చేయడమే ఈ సమస్యకు పరిష్కారమని, ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి సువ్వాడ మణి వద్ద సాక్షి ప్రస్తావించగా ఆమె స్పందిస్తూ రామన్నపేటలో 40వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు ఉందని, కొత్తగా మరో 35వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు మంజూరైందని చెప్పారు. పనులను కాంట్రాక్టర్లకు అప్పగించాక కొత్త ట్యాంకు నిర్మాణంతో పాటు కొత్త పైపులైన్‌లు వేయిస్తామని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



గ్రామంలోని ఓ వీధిలో ట్యాప్ లేని కుళాయి పైపు



గోతిలో మురుగునీటి మధ్య ఉన్న కుళాయి



ఓ వీధిలో మురుగునీటి కాలువను ఆనుకుని ఉన్న కుళాయి

కల్తీ మద్యంతో ప్రాణాలు తీస్తున్న కూటమి సర్కారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- టీడీపీ నేతలే కల్తీ మద్యంలో ప్రధాన పాత్రధారులు
- పేద ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్న కూటమి నేతలు
- ఈ నెల 13న నియోజకవర్గ స్థాయిలో నిరసన ర్యాలీ

చీపురుపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా లైసెన్స్ ఉన్న మద్యం దుకాణాల నుంచి కూటమి ప్రభుత్వమే కల్తీ మద్యం అమ్ముతూ పేద ప్రజల ప్రాణాలను బలిగొంటోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం ఆరోపించారు. చీపురుపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 19 నెలల్లో సాధించింది ఏమిటంటే కల్తీ మద్యం పరిశ్రమలు స్థాపించడమేనని చెప్పారు. టీడీపీ నేతలు కల్తీ మద్యం పరిశ్రమలు స్థాపించి లైసెన్సుడు మద్యం దుకాణాల నుంచి కల్తీ మద్యం అమ్మకాల విషయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్‌కు తెలుసన్నారు. కల్తీ మద్యం అమ్మకాలతో నేతలు వేలాది కోట్లు దోచుకుంటుండగా, పేద ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కల్తీ మద్యం అమ్మకాలను నిరసిస్తూ ఈ నెల 13న ఉదయం 10 గంటలకు నియోజకవర్గ స్థాయిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. చీపురుపల్లి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి నిరసన ర్యాలీ ప్రారంభించి మెయిన్‌రోడ్, శివరాం రోడ్ మీదుగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుని సీఐకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దన రావు, మేధావుల వర్గం ప్రతినిధి ఎంపీఎస్ఎన్.రాజు, పీఎంపీ చైర్మన్ గవిడి సురేష్, ఎంపీటీసీ గిరడ రాందాసు, ముల్లు పైడిరాజు, రౌతు పైడిరాజు, కరణం ఆది తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



సంతోష్‌కుమార్, శ్రావణిని సత్కరిస్తున్న లైబ్రేరియన్ శ్రీధర్, తదితరులు

శృంగవరపుకోట: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఉన్న స్టడీ మెటీరియల్‌తో చదివి 2025 డీఎస్సీలో కొలువులు సాధించిన బొడ్డేటి సంతోష్‌కుమార్, పల్లె శ్రావణిని గ్రంథాలయ ప్రాంగణంలో లైబ్రేరియన్ డి.శ్రీధర్ నేతృత్వంలో శనివారం సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ రఘురాజు, తదితర పాఠకులు అంతా స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించిన బొడ్డేటి సంతోష్‌కుమార్, సెకండరీ గ్రేడ్ టీచర్‌గాఎంపికైన పల్లె శ్రావణిని అభినందించారు. సన్మానగ్రహీతలు మాట్లాడుతూ తమ సక్సెస్‌కి సగం కారణం స్థానిక శాఖాగ్రంథాలయమేనని అన్నారు. లైబ్రేరియన్ శ్రీధర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లలో ఎస్పీ తనిఖీలు



ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో భవనాలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

శృంగవరపుకోట: జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన దామోదర్ శనివారం ఎస్.కోట, వల్లంపూడి పోలీస్ స్టేషన్‌లలో తనిఖీలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్న సమస్యాత్మక గ్రామాలు, రాజకీయ వైషమ్యాలు, శాంతి భద్రతలు, క్రైమ్ రేట్, పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఎక్కడా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా విధులు నిర్వర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ పరిశీలించిన ఆయన ప్రతి విషయంలో కచ్చితత్వం కావాలన్నారు. ప్రధానంగా గంజాయి వినియోగం, అక్రమ రవాణాపై నిఘా పెంచాలని, యువత గంజాయి మత్తుకు బానిస కాకుండా చూడాలని చెప్పారు. స్టేషన్‌లో విభాగాలు, భవనాల పరిస్థితిని ఆయన పర్యవేక్షించారు. ఆయన వెంట ఎస్.కోట, ఎస్.కోట రూరల్ సీఐలు వి.నారాయణమూర్తి, అప్పలనాయుడు, ఎస్ఐలు చంద్రశేఖర్, సుదర్శన్ ఉన్నారు.

సీజేఐపై దాడి హేయం



నిరసన తెలుపుతున్న సీపీఎం, కార్మిక సంఘాల నాయకులు

వేపాడ: దేశఅత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్ భూషన్ రామకృష్ణ గవాయ్‌పై న్యాయవాది రాకేష్‌కిషోర్ బూటు విసరడం హేయమైన చర్య అని సీపీఎం నాయకుడు చల్లా జగన్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా జగన్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద చర్యలే ఈతరహా దాడికి కారణమని మండిపడ్డారు.దేశ అత్యున్నత న్యాయస్థానంలోని ప్రధాన న్యాయమూర్తులకే రక్షణ కరువైతే సామాన్యుల సంగతి ఏంటని ప్రశ్నించారు.దాడికి పాల్పడిన న్యాయవాదిని జీవితకాలం బార్ కౌన్సిల్‌నంచి బహిష్కరించి, కేసు నమోదు చేసి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఏడువాక అప్పలనాయుడు, దేబార్కి కిరణ్, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దారుణం

- విద్య,వైద్య రంగాలను తుంగలో తొక్కుతున్న కూటమి ప్రభుత్వం
- కోటి సంతకాల సేకరణ వాల్ పోస్టర్ల ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు



కోటిసంతకాల సేకరణ వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్ బాబు,తదితరులు

గజపతినగరం: పేద పిల్లలకు వైద్య విద్య భారం కాకూడదని, పేదలకు వైద్య సేవలు మరింత చేరువ కావాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకువస్తే... టీడీపీ కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీక రిస్తూ నిర్ణయం తీసుకోవడం దారుణం, దుర్మార్గమని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ డాక్టర్ పి.వి.వి.సూర్యనారాయణ రాజు(సురేష్ బాబు) మండిపడ్డారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వ ర్యంలో చేపట్టనున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి వారు శనివారం ఆవిష్కరించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. నవంబర్ 22వ తేదీ వరకు గ్రామాల్లో సంతకాల సేకరణ చేపడతామని తెలిపారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రానికి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకురాగా, ఆరుచోట్ల కళాశాలల నిర్మాణం పూర్తి చేసిందని, కొన్ని కళాశాలల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం మిగులు పనులు పూర్తి చేయకుండా ప్రైవేటు వ్యక్తులకు వాటిని కట్టబెట్టాలని చూస్తుండడం రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేయడం కాదా అని ప్రశ్నించారు. మెడికల్ కళాశాలలను టీడీపీ వ్యక్తుల చేతుల్లో పెట్టి ప్రజలను దోచుకునేందుకు కుట్ర పన్నుతున్నారని, నిరుపేద పిల్లల జీవితాలతో సీఎం చంద్రబాబు ఆటలాడుతున్నారని మండిపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకాన్ని కూడా ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేసి ఉపయోగం లేని హెల్త్ ఇన్స్యూరెన్స్ పాలసీని తీసుకువస్తున్నారని అన్నారు. ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి,అక్రమాలపై ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం,దాడులు చేయడం తప్ప ఈ 15 నెలల పాలనలో చేసిందేమీ లేదన్నారు. తాగునీటి కలుషితం వల్ల మన్యం జిల్లాలో ఇద్దరు విద్యార్థినులు చనిపోతే ఈ ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్లు కూడా లేదని చెప్పారు. గజపతినగరం మండలంలోని మరుపల్లిలో 40 ఎకరాల్లో ఫుడ్ పార్క్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో చెప్పారని, నేటికీ ఆ ఊసే లేదని అన్నారు.

అమ్మవారి పండగలో కొత్త సంస్కృతి

విజయనగరం పైడితల్లి అమ్మవారి పండగకు ఎన్నడూ లేని విధంగా టీడీపీ కూటమి ప్రభుత్వం కొత్త సంస్కృతిని తీసుకొచ్చిందని అప్పలనరసయ్య ఆరో పించారు. జిల్లా కేంద్రంలోని దుకాణాల నిర్వాహ కులతో పాటు, జిల్లాలోని రైస్ మిల్లర్స్, వైన్‌షాపుల నుంచి కూడా డబ్బులు వసూలు చేశారని అన్నారు. మాజీ మంత్రి బొత్ససత్యనారాయణను అమ్మవారి పండగలో ఏ విధంగా అవమానించారో ప్రజలంతా గమనించారని అన్నారు.

13న ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన

టీడీపీ నాయకులు కుటీర పరిశ్రమలు ఎర్పాటు చేసి నకిలీ మద్యం తయారు చేసి దుకాణాలకు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అప్పలనరసయ్య ఆరోపించారు. ఊరూరా బెల్ట్ షాపులతో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని మండిపడ్డారు. కల్తీ మద్యం, బెల్ట్ షాపులను నిర్మూలించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 13న స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేయనున్నామని చెప్పారు. పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తరలి రావాలని కోరారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నారాయణమూర్తిరాజు, జిల్లా ఎస్సీసెల్ విభాగం అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, గజపతినగరం, దత్తిరాజేరు మండలాల జెడ్పీటీసీలు గార తవుడు,రౌతు రాజేశ్వరి,గజపతినగరం,దత్తిరాజేరు,బొండపల్లి మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బూడి వెంకటరావు, కృష్ణార్జున, చిన్నం నాయుడు,దత్తిరాజేరు ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, నాయకులు నాయకుడు వి.ముత్యాల నాయుడు, బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కరణం ఆదినారాయణ, మిత్తిరెడ్డి రమేష్‌నాయుడు,తదితరులు పాల్గొన్నారు.

మద్యం నాణ్యతా ప్రమాణాల పరిశీలన



గజపతినగరం: దావాలపేటలోని మద్యం దుకాణంలో మద్యం నిల్వలను పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ జనార్దనరావు, సిబ్బంది



కొత్తవలస: కొత్తవలస మండలంలోని ఓ మద్యం దుకాణంలో నాణ్యత పరీక్షిస్తున్న సీఐ రాజశేఖరనాయుడు



మెరకముడిదాం: మద్యం నాణ్యత పరిశీలిస్తున్న ఎక్సైజ్ శాఖ ఎస్ఐ గిరిష్, సిబ్బంది

కొత్తవలస: కొత్తవలస ఎక్సైజ్ శాఖ కార్యాలయం పరిధిలోని వేపాడ,కొత్తవలస,లక్కవరపుకోట మండలాల్లో గల మద్యం దుకాణాల్లో విక్రయిస్తున్న మద్యం నాణ్యతా ప్రమాణాలను ఎక్సైజ్ సీఐ జి.ఎస్.రాజశేఖరనాయుడు ఆధ్వర్యంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. మూడు మండలాల్లోని 17 మద్యం దుకాణాల్లో శాంపిల్స్ సేకరించి పరీక్షలు చేయగా, ఫలితాలు సక్రమంగా ఉన్నట్టు వచ్చాయన్నారు.

గజపతినగరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో..

గజపతినగరం: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి ఆదేశాల మేరకు గజపతినగరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గజపతినగరం,దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాల్లోని16 మద్యం దుకాణాల్లో శనివారం తనిఖీల నిర్వహణతో పాటు మద్యం శాంపిల్స్ సేకరించామని గజపతినగరం ఎక్సైజ్ స్టేషన్ సీఐ జె.జనార్దనరావు తెలిపారు. మద్యం శాంపిల్స్‌ను విశాఖపట్నంలోని ఎక్సైజ్ శాఖ లేబొరేటరీకి పంపించామని చెప్పారు.ఎస్ఐలు పి.నరేంద్ర కుమార్, పి.శాంతిలక్ష్మి పాల్గొన్నారు.

మెరకముడిదాం మండలంలో..

మెరకముడిదాం: మండలంలోని మద్యం దుకాణాల్లో చీపురుపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ జి.గిరీష్, సిబ్బంది శనివారం తనిఖీలు నిర్వహించారు. మద్యం నాణ్యతను పరిశీలించారు. ఎక్కడైనా కల్తీ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు ఎవరికైనా అనుమానం వస్తే వెంటనే 14405 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

గుండెపోటుతో మాజీ జెడ్పీటీసీ మృతి



బి.పెదబాబు (ఫైల్)

జామి: మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పీటీసీ బండారు ప్రకాశరావు(పెదబాబు) శనివారం తెల్లవారు జామున గుండెపోటుతో తన నివాసంలో మృతిచెందారు.ఆయనకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రైతులపక్షాన పోరాటం చేసేవారు.మంత్రి కొండపల్లి శ్రీనివాస్, తదితర నేతలు పెదబాబు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బాలికా సంరక్షణకు పెద్ద పీట



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

బొండపల్లి: బాలికల సంరక్షణ, వారి అభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఒంపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ బాలికల దినోత్సవానికి ఆయన అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బాలికల కోసం పోస్టల్ శాఖ ద్వారా సుకన్య సమృద్ధి యోజన పథకం అమలు చేస్తోందని చెప్పారు. సుకన్య సమృద్ధి పథకం ఖాతాలను తెరచి ఆడపిల్లల పేరిట తల్లిదండ్రులు కొంతమొత్తం పొదుపు చేయాలని చెప్పారు.బాలికలు,బాలురుతో సమానంగా ఎదుగేందుకు అన్ని అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు కూడా లింగ వివక్ష లేకుండా పిల్లలను చుడాల్సిన బాధ్యత ఉందన్నారు.ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనాలు బాగున్నాయా అని విద్యార్థులను మంత్రి అడుగగా బాగోలేవని సమాదానం చెప్పడంతో ఉపాధ్యాయులను పిలిచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా తీసుకోవాలని సూచించారు. వేంద్రాం గ్రామంలోని చాలా మంది విద్యార్థులకు తల్లికి వందనం డబ్బులు జమ కాలేదని టీడీపీ నాయకుడు సంతోష్ కుమార్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈవిషయాన్ని పరిశీలిస్తామని మంత్రి తెలిపారు.ఏఎంసీ చైర్మన్ పి.వి.వి.గోపాలరాజు, స్థానిక సర్పంచ్ లండా నారాయణమ్మ,తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, ఎంపీడీఓ జి.గిరిబాల, ఐసీడీఎస్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జెండర్ రిసోర్సు సెంటర్ ప్రారంభం

బొండపల్లి:

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన జెండర్ రిసోర్సుసెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలకు సిద్ధపడితే ఈ కేంద్రానికి సమాచారమివ్వాలని చెప్పారు. అలాగే భార్య,భర్తల మధ్య తగాదాలు గ్రామ స్థాయిలో పరిష్కారం కాని వారు ఈ కేంద్రానికి వస్తే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ పి.శ్రీనివాస్ తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, ఎస్ఐ యు.మహేష్, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.